





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

PEN POWER TELUGU DAILY

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 228 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 24 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 228 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 24 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## వీరయ్య చౌదరి కుటుంబానికి అండగా ఉంటాం

- వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు... హంతకులకు మాస్ వార్నింగ్
- ఒంగోలులో మొన్న టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య
- నిన్న అమ్మనబ్రోలు గ్రామానికి వచ్చిన చంద్రబాబు
- వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులకు పరామర్శ



**పెన్ పవర్ డెస్క్:**ఒంగోలులో మొన్న రాత్రి హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చేరుకున్న సీఎం, వీరయ్య చౌదరి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది. అమ్మనబ్రోలుకు చేరుకున్న ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణ రెడ్డి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు. వారు కూడా వీరయ్య చౌదరి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, వీరయ్య చౌదరిని దారుణంగా హతమార్చారని వెల్లడించారు. కరడుగట్టిన నేరస్తుల కంటే దారుణంగా హత్య చేశారని, 53 చోట్ల కత్తిపోట్లు ఉన్నాయంటే ఎలా చంపారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వారు భూమ్మీద ఉండేందుకు అనర్హులు... వారిని ఎట్టి పరిస్థితుల్లోనైనా పట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఇంత ఘోరానికి పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, తద్వారా వీరయ్య చౌదరి ఆత్మకు శాంతి కలిగేలా చేస్తామని చెప్పారు. వీరయ్య చౌదరి ఎంతో సమర్థుడైన నాయకుడని, పార్టీకి ఎన్నో సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. లోకేశ్ తో పాటు పాదయాత్రలో 100 రోజుల పాటు తిరిగాడని గుర్తు చేసుకున్నారు. ఎవరికి కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తి... పిలిస్తే పలికే నేత వీరయ్య... ఇలాంటి వ్యక్తిని చంపేశారని, నిందితులను వదిలిపెట్టే ప్రశ్నే లేదని పునరుద్ఘాటించారు. నిందితులు ఎంత తెలివైనవాళ్లు అయినా ఎక్కడో ఒక చోట క్లూస్ వదిలిపెడతారని, వారు ఎక్కడున్నా గాలించి పట్టుకుంటామని అన్నారు. హంతకుల కోసం 12 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఈ మండలంలో టీడీపీకి 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందంటే వీరయ్య చౌదరి సత్తా ఏంటో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి మంచి నాయకుడ్ని కోల్పోవడం బాధ కలుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉండి కూడా ఇలాంటి ఘోరాలు జరుగుతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి హత్యా రాజకీయాలు చేసే వ్యక్తులకు ఒకటే హెచ్చరిక... మీరు కూడా కాలగర్భంలో కలిసిపోతారు జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు.

కార్యకర్తలు భయపడొద్దని, ఓ కుటుంబ పెద్దగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నేర రాజకీయాలు చేసే పరిస్థితి కనిపిస్తోందని, అలాంటి వారిని అందరినీ తుదముట్టించే వరకు ఈ పోరాటం ఆగదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పహల్గాం దాడికి త్వరలోనే గట్టి జవాబు ఇస్తాం

- ఉగ్రవాదులకు రక్షణ మంత్రి గట్టి జవాబు
- దాడికి పాల్పడిన వారికి, వెనకుండి నడిపించిన వారికీ గట్టి సమాధానం ఇస్తామని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం ఉపేక్షించదని స్పష్టీకరణ




**పెన్ పవర్ డెస్క్:**జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులు, పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత హేయమైన ఉగ్రదాడిపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, వారి వెనకుండి నడిపించిన సూత్రధారులను విడిచిపెట్టబోమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఉగ్రవాదం పట్ల భారత్ ఏమాత్రం సహించబోదని ఆయన స్పష్టం చేశారు.దాడి ఘటన అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌తో సమావేశమయ్యారు.

వివరాలు 2లో..

## ప్రధాని మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం..

- జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి
- అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- మోదీ నివాసంలో కీలక సమావేశం
- భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ



**పెన్ పవర్ డెస్క్:**జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో, దేశ రాజధాని న్యూఢిల్లీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైంది.

వివరాలు 2లో..

## కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి షాక్.. నెగ్గిన అవిశ్వాసం!



- శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం సఫలం
- ఛైర్‌పర్సన్ నజీమున్నీసా, వైస్ ఛైర్మన్లపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- మొత్తం 36 మందికిగానూ 25 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా ఓటు
- అవిశ్వాస సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- కదిరి మున్సిపాలిటీ కూటమి వశం కావడంతో టీడీపీ సంబరాలు

**పెన్ పవర్ డెస్క్:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసాతో పాటు వైస్ ఛైర్మన్లు గంగాదేవి, రాజశేఖర్ రెడ్డిలపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ పరిణామంతో కదిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఖాతాలోకి చేరింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌కు 25 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. హాజరైన సభ్యులందరూ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. కాగా, అధికార వైసీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఎమ్మెల్యే కందికుంట

వివరాలు 2లో..

## ఖరీఫ్‌కు ఉత్తరాంధ్రకు నీరు అందించడమే లక్ష్యం

- ఉత్తరాంధ్రకు ఖరీఫ్ నాటికి గోదావరి జలాలు అందించడమే లక్ష్యమని నిమ్మల వెల్లడి
- పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 8 ప్యాకేజీలుగా వేగవంతం
- రూ.1200 కోట్లతో పనులు... జూన్ కల్లా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు

వివరాలు 2లో..



## మహిళకు టోకరా వేసిన కేసులో అఘోరీకి రిమాండ్

- పూజల పేరుతో మహిళ నుంచి రూ.10 లక్షలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- అఘోరీని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:** ప్రత్యేక పూజల పేరుతో ఓ మహిళ నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి మోసగించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అఘోరీకి చేవెళ్ల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు అఘోరీని అదుపులోకి తీసుకుని, అనంతరం కోర్టు ముందు హాజరుపరిచారు. వివరాల్లోకి వెళితే, ఓ మహిళ తన సమస్యల పరిష్కారం కోసం

వివరాలు 2లో..



## దివ్యాంగుడైన ట్రైనర్ తో నేలపై కూర్చొని మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్

- ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో మంత్రి నాదెండ్ల పర్యటన
- గిరిజన వెదురు హస్తకళల శిక్షణ, తయారీ, ప్రదర్శన కేంద్రం ప్రారంభం
- స్థానికులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్న మంత్రి నాదెండ్ల



**పెన్ పవర్ డెస్క్:**ఏజెన్సీ ప్రాంత గిరిజనుల నైపుణ్యానికి, ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం పులి రాముడు గూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరిజన వెదురు హస్తకళల శిక్షణ, తయారీ, ప్రదర్శన కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల


వివరాలు 2లో..

## టర్కీలో భూకంపం.. ఇళ్ల నుంచి పరుగు తీసిన ఇస్తాంబుల్ వాసులు

- టర్కీలో 6.2 తీవ్రతతో భూకంపం
- ప్రధాన నగరం ఇస్తాంబుల్‌లో కంపించిన భూమి
- ఇస్తాంబుల్‌కు నైరుతి దిశలో 40 కి.మీ దూరంలో భూకంప కేంద్రం
- బల్గేరియా, గ్రీస్, రొమేనియాలలో కూడా ప్రకంపనలు

**పెన్ పవర్ డెస్క్:**టర్కీలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ఆ దేశ అత్యవసర నిర్వహణ సంస్థ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా ఇస్తాంబుల్‌లో బలమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం, ఇస్తాంబుల్ నగరానికి నైరుతి దిశగా సుమారు 40 కిలోమీటర్ల దూరంలో, భూమికి 10 కిలోమీటర్ల లోతున భూకంప

వివరాలు 2లో..



## పహల్గామ్ దాడి: భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం



- జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రపంచ నేతల తీవ్ర ఖండన
- ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, మారిషస్, న్యూజిలాండ్, సింగపూర్ అధినేతల దిగ్భ్రాంతి, సంతాపం
- భారత ప్రధాని మోదీకి ఫోన్ చేసి సంఘీభావం తెలిపిన ఆస్ట్రేలియా, మారిషస్ ప్రధానులు
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటన

వివరాలు 2లో..

## ఉగ్రవాదులు ప్రజలను మతం అడిగి హతమార్చడం దారుణం

- పహల్గామ్ ఉగ్రదాడిపై ఎంఐఎం అధినేత ఒవైసీ స్పందన
- దాడికి నిఘా వైఫల్యమే కారణమని తీవ్ర ఆరోపణ.
- కేంద్రం జవాబుదారీతనం వహించాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన భయానక ఉగ్రవాద దాడి ఘటనపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ దాడి పూర్తిగా నిఘా వైఫల్యం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. నేడు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ, ఈ దుశ్చర్యకు నరేంద్ర మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పహల్గామ్ ఘటనను

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### దువ్వాడను ఆలస్యంగానైనా వదిలించుకున్నారా?

# లేకుంటే ఇది కూడా డ్రామానేనా?

వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.

**అనంత బాబు విషయంలోనూ...**

గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి.

**కొత్తగా జరిగింది కాదే...**

ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది. దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఆయన ఇంటివద్ద ఆందోళనకు దిగారు. .దువ్వాడ శ్రీనివాస్ తో వాణి వివాహమయింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే గత కొంత కాలం నుంచి ఇద్దరూ విడిపోయి ఉంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అంతకు ముందు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. ఓటమి పాలు కావడంతో ఆయనకు వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తర్వాత 2024 ఎన్నికల్లో టెక్కలి సీటును కూడా దువ్వాడ శ్రీనివాస్ కే జగన్ కేటాయించారు. దీంతో పాటు మాధురి అనే మహిళతో బయట చక్కెర్లు కొడుతున్నారు. అయినా సరే ఇప్పటి వరకూ పార్టీ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఇంతకాలం వెయిట్ చేసి...**

వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో రచ్చ మొదలయింది. ఇది టెక్కలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ అయింది. పార్టీకి కూడా తలనొప్పిగా మారింది. ఒక ఎమ్మెల్సీగా ఉండి భార్యకు విడాకులు ఇవ్వకుండా దువ్వాడ శ్రీనివాస్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని ఆయన భార్య వాణి ఆరోపిస్తున్నారు. ఆమె ట్రాప్ లో పడి తమను పూర్తిగా వదిలేశారంటున్నారు. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్, మాధురి కలసి టూర్లు చేస్తున్నారు. అయినా పార్టీ పట్టించుకోలేదు. తిరుమలలోనూ ఫొటో షూట్ వివాదంగా మారింది. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేట వేయడం డ్రామాగానే చూడాల్సివస్తుందని, పార్టీకి ఉత్తరాంధ్రలో జరుగుతున్న డ్యామేజీని కాపాడుకోవడానికే ఇప్పుడు సస్పెన్షన్ వేటు వేశారంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అందులో నిజం కూడా ఉంది కదా?

# కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి షాక్.. నెగ్గిన అవిశ్వాసం!

- మొదటి పేజీ తరువాయి

వెంకటప్రసాద్ ఓటు అవసరం లేకుండానే కోరం ఉండటంతో తీర్మానం ఆమోదం పొందింది. గత కొంతకాలంగా ఛైర్‌పర్సన్ నజీమున్నీసాపై సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, అభివృద్ధి పనులు జరగడం లేదని, పరిపాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే టీడీపీ మద్దతుతో కొందరు కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. తీర్మానం నెగ్గడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో కదిరి మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోయిందని, పరిపాలనా సౌలభ్యం కొరవడిందని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి నెలకొందన్నారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన వైసీపీ కౌన్సిలర్లతో సహా సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. హిందూపురం తర్వాత కదిరి మున్సిపాలిటీ కూడా కూటమి వశం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

# మహిళకు టోకరా వేసిన కేసులో అఘోరీకి రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

అఘోరీని ఆశ్రయించారు. ప్రత్యేక పూజలు చేస్తే అన్ని కష్టాలు తొలగిపోతాయని నమ్మించిన అఘోరీ, సదరు మహిళ నుంచి దశలవారీగా సుమారు రూ. 10 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అయితే, ఎంతకాలమైనా తన సమస్యలు తీరకపోవడం, అఘోరీ ప్రవర్తనపై అనుమానం రావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అఘోరీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ప్రాథమిక ఆధారాలు, వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, అఘోరీకి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో అఘోరీని సంగారెడ్డి సబ్ జైలుకు తరలించారు.

ఈ సందర్భంగా అఘోరీ మాట్లాడుతూ, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందని, తాను పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని తెలిపింది. కాగా, అఘోరీ ఇటీవల వర్షిణి అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరినీ పోలీసులు మధ్యప్రదేశ్, యూపీ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండగా గుర్తించారు. అఘోరీని అదుపులోకి తీసుకుని నార్సింగి పీఎస్ కు తరలించారు. మరోవైపు, వర్షిణిని కౌన్సిలింగ్ సెంటర్ కు తరలించినట్టు తెలుస్తోంది.

### ఉగ్రవాదులు ప్రజలను మతం అడిగి

# హతమార్చడం దారుణం

- మొదటి పేజీ తరువాయి

ఒక 'ఊచకోత'గా అభివర్ణించిన ఒవైసీ, ఉగ్రవాదులు మతం అడిగి అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా హతమార్చారని అన్నారు. "పహల్గామ్‌లో మతం అడిగిన తర్వాత ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు నిఘా వైఫల్యమే కారణం" అని ఆయన స్పష్టం చేశారు. ఇది గతంలోని ఉరి, పుల్వామా సంఘటనల కన్నా ప్రమాదకరమైనదని, తీవ్ర విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని, బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. నిన్న కూడా ఒవైసీ ఈ దాడిని ఖండించారు. సైనిక దుస్తుల్లో వచ్చి అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం హేయమైన చర్య అని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. కాగా, మంగళవారం నాడు అనంత్‌నాగ్ జిల్లా పరిధిలోని పహల్గామ్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. 'మినీ స్విట్జర్లాండ్'గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో పర్యటిస్తున్న పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు.

### పహల్గాం దాడికి త్వరలోనే

# గట్టి జవాబు ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆయన మాట్లాడుతూ, "ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి సమీప భవిష్యత్తులోనే గట్టి సమాధానం చెబుతాం" అని హెచ్చరించారు. "దాడి చేసిన వారిని పట్టుకోవడమే కాదు, ఈ కుట్ర వెనుక తెరచాటున దాగి ఉన్న వారిని కూడా వదిలిపెట్టం. దాడి చేసిన వారిని, వారి వెనుక ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ ఐక్యంగా ఉందని, ఉగ్రవాదం పట్ల తమది 'జీరో టాలరెన్స్' విధానమని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. అవసరమైన, తగిన ప్రతిచర్య తీసుకుంటామని ఆయన తెలిపారు. భారత్ ఒక ప్రాచీన దేశమని, ఉగ్రవాదానికి భయపడదని అన్నారు.

## పహల్గామ్ దాడి: భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన దారుణ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ హేయమైన చర్యలో పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పలు దేశాధినేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో భారత్‌కు అండగా ఉంటామని, ఉగ్రవాదంపై పోరులో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం స్పందిస్తూ, పహల్గామ్‌లో జరిగినది హేయమైన ఉగ్రదాడి అని పేర్కొన్నారు. వివిధ వర్గాలకు చెందిన అనేక మంది స్త్రీ, పురుషులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాల దుఃఖాన్ని పంచుకుంటున్నామని, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్-నోయెల్ బారోట్ కూడా ఈ అమానవీయ దాడి నేపథ్యంలో భారత్‌కు తమ సంపూర్ణ సంఘీభావం ఉంటుందని స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ నేరుగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. జమ్మూ కశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అమాయక పౌరుల ప్రాణాలను బలిగొన్న ఈ అర్థరహిత హింస యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్ట్రేలియా, భారత్ మంచి మిత్రులని, ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని అల్బనీస్ హామీ ఇచ్చారు. ఉగ్రవాదంపై పోరులో సహకారం అందిస్తామని తెలిపారు. మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గులామ్ కూడా ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పహల్గామ్ దాడిని పిరికిపంద చర్యగా ఖండించారు. అమాయకుల హత్య పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ దుఃఖ సమయంలో భారత ప్రజలకు అండగా ఉంటామని, ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాలు ఐక్యంగా నిలుస్తాయని రామ్‌గూలమ్ స్పష్టం చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సైతం కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమని, ఈ కష్ట సమయంలో న్యూజిలాండ్ ప్రజల ఆలోచనలు భారత ప్రజలతోనే ఉన్నాయని ఆయన 'ఎక్స్' లో పేర్కొన్నారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ కూడా పహల్గామ్ దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని సింగపూర్ తీవ్రంగా ఖండిస్తుందని, ఈ సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని తెలిపారు. మంగళవారం నాడు పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయ ప్రాంతంలో పర్యాటకులపై ఈ దాడి జరిగింది. సమీపంలోని దట్టమైన అడవుల నుంచి వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో పర్యాటకులు మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ఈ దాడికి బాధ్యత వహించినట్లు ప్రాథమిక నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై అధికారిక ధృవీకరణ ఇంకా రావాల్సి ఉంది. ఈ దాడి నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. లోయ వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, అదనపు బలగాలను మోహరించారు.

### ప్రధాని మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల

# కేబినెట్ కమిటీ సమావేశం..

- మొదటి పేజీ తరువాయి

లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ భేటీకి అధ్యక్షత వహిస్తున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరితో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ త్రిపాఠి, ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమన్ ప్రీత్ సింగ్‌లు కూడా హాజరై తాజా భద్రతా పరిస్థితులపై చర్చిస్తున్నట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జమ్మూకశ్మీర్‌లోని భద్రతా పరిస్థితులు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, పహల్గాం దాడికి సంబంధించి భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలు, భద్రతాపరమైన అంశాలపై కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, ఈ సీసీఎస్ సమావేశానికి ముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పహల్గాం దాడికి పాల్పడిన వారిని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేసిన విషయం గమనార్హం. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం జరుగుతున్న ఉన్నత స్థాయి సమావేశం అనంతరం కీలక ప్రకటన వెలువడే అవకాశం కనిపిస్తోంది.

## దివ్యాంగుడైన ట్రైనర్ తో నేలపై కూర్చొని మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్

- మొదటి పేజీ తరువాయి

శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ప్రారంభించారు. మంత్రి నాదెండ్ల స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా, పలు అభివృద్ధి కార్యక్రమాలపై హామీ ఇచ్చారు.

**నేలపై కూర్చుని ఆప్యాయంగా పలకరింపు**

శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం, మంత్రి నాదెండ్ల మనోహర్ అక్కడి శిక్షకుడు, దివ్యాంగుడైన మారయ్యతో ప్రత్యేకంగా మాట్లాడారు. మారయ్య నేలపై కూర్చొని ఉండటాన్ని గమనించిన మంత్రి, తాను కూడా నేలపైనే కూర్చుని శిక్షణా కార్యక్రమం, కేంద్రం పనితీరు గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ, "ఈ కేంద్రంలో మూడు నెలల పాటు వెదురు హస్తకళలపై శిక్షణ ఇస్తాం. ఐటీడీఏ సహకారంతో శిక్షణకు అవసరమైన పరికరాలు అందిస్తున్నాం. ఏడాదికి నాలుగు బ్యాచ్‌లలో, ఒక్కో బ్యాచ్‌లో 200 మంది గిరిజన యువతకు శిక్షణ ఇస్తాం" అని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి యూనిట్లు స్థాపించుకునేందుకు బ్యాంకుల ద్వారా రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు అందించే ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. తాము తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని మారయ్య మంత్రిని కోరగా, తక్షణమే చర్యలు తీసుకుంటానని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు.

**గిరిజన ఉత్పత్తులకు జాతీయ స్థాయి గుర్తింపు**

అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో పండే పంటలకు, హస్తకళల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నాయి. కానీ, ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించక గిరిజనులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ను బలోపేతం చేస్తాం" అని అన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.

**స్థానిక సమస్యలపై తక్షణ స్పందన**

ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య ఉందని చెప్పగా, గురువారం నుంచే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఐటీడీఏ పీఓను మంత్రి ఆదేశించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, మే 1వ తేదీ నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రోడ్ల సమస్యను ఏడాదిలోగా పరిష్కరిస్తామని తెలిపారు. వైద్య సేవలపై ఫిర్యాదు చేయగా, ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకల్లా ఓపీ పూర్తి చేయాలని, మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

# టర్కీలో భూకంపం.. ఇళ్ల నుంచి పరుగు తీసిన ఇస్తాంబుల్ వాసులు

- మొదటి పేజీ తరువాయి

కేంద్రం కేంద్రీకృతమై ఉంది. భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇస్తాంబుల్ వాసులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. టర్కీతో పాటు పొరుగున ఉన్న బల్గేరియా, గ్రీస్, రొమేనియా దేశాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం వల్ల జరిగిన ఆస్తి నష్టం లేదా ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. సహాయక బృందాలు అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో సంభవించిన పెను భూకంప విషాదం నుంచి టర్కీ పూర్తిగా తేరుకోలేదు. అప్పుడు 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం దేశంలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. ఆ మహా విపత్తులో ఒక్క టర్కీలోనే 53,000 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సిరియాలో కూడా సుమారు 6,000 మంది మరణించారు.

# ఖరీఫ్‌కు ఉత్తరాంధ్రకు నీరు అందించడమే లక్ష్యం

**పెన్ పవర్ డెస్క్:** పోలవరం ప్రాజెక్టు పనులు, ముఖ్యంగా ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, ఈ ఖరీఫ్ నాటికి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీర్-ఇన్-చీఫ్ వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తితో కలిసి తొండంగి మండలం బెండపూడి, శంఖవరం మండలం అన్నవరం వద్ద నిర్మిస్తున్న పంపా ఆక్విడెక్ట్ పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎడమ కాలువ పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నామని తెలిపారు.

"ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు పోలవరం ఎడమ కాలువను సందర్శించి, జూన్ 25 కల్లా మొదటి దశ పనులు పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకునేందుకు తక్షణమే రూ. 1200 కోట్లు మంజూరు చేసి, టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించాం" అని మంత్రి వివరించారు. ఎడమ కాలువ పనులను మొత్తం 8 ప్యాకేజీలుగా విభజించి

ఏకకాలంలో పనులు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొన్నిచోట్ల పనులు క్లిష్టంగా ఉన్నాయని, ముఖ్యంగా పంపా ఆక్విడెక్ట్ వద్ద ఇటీవల వరకు నీరు నిలిచి ఉండటం, ఇప్పుడు నీటిని తోడి లోతుగా ఫౌండేషన్ పనులు (సుమారు 100 అడుగుల లోతు) చేయాల్సి రావడం సవాలుగా ఉందని అన్నారు. పోలవరం ప్రధాన డ్యామ్ పనుల పురోగతి గురించి మాట్లాడుతూ, డయాఫ్రం వాల్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఏప్రిల్ 20 నాటికి 200 మీటర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఇప్పటికే రెండు కట్టర్లు పనిచేస్తుండగా, ఈ నెలాఖరుకు మూడో కట్టర్ రానుందని చెప్పారు. డిసెంబర్ 2025 నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మొత్తం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే సాంకేతిక అంశాలు అనుకూలిస్తే 2027 జూన్ నాటికి, అంటే గోదావరి పుష్కరాల సమయానికి పూర్తి చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పినట్లు మంత్రి నిమ్మల తెలిపారు.

# కూటమిప్రభుత్వంలో హత్యా రాజకీయాలకు తావులేదు

## వీరయ్య చౌదరి హంతకులకు కఠిన శిక్ష తప్పదు : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

కూటమిప్రభుత్వంలో హత్యలు, అరాచకాలకు తావులేదు.టీడీపీ అధికార ప్రతినిధి సంతనూతలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాను, వీరయ్య చౌదరిని చంపినవారు, వారివెనకున్న వారు ఎవరైనా.. ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. చట్టానికి కట్టుబడి, న్యాయబద్ధంగా పాలన చేస్తున్న ప్రజా ప్రభుత్వం ఆటవిక, ఉన్మాద చర్యలకు ముగింపు పలుకుతుంది. కూటమిప్రభుత్వం దోషుల్ని గుర్తించి, త్వరలోనే వారికి కఠినశిక్ష పడేలా చేస్తుంది. వీరయ్య చౌదరి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. వీరయ్యచౌదరి అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆవేశకావేశాలకు లోను కాకుండా సంయమనంతో వ్యవహరించాలి.అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో సూచించారు.



# పెన్ పవర్

గుంటూరు । బాపట్ల । పల్నాడు




# మా స్కూలు మాకే కావాలి

పిల్లల ప్రాణాలతో చెలగాటలాడలేము

ఎమ్మెల్యే తో మొరపెట్టుకున్న ఫలితం లేదు

దళిత విద్యార్థులను అణచివేసే ప్రయత్నం జరుగుతుంది.

బ్రహ్మానందపురం దళితుల వేదన

స్కూలు తరలింపు ప్రక్రియను ఆపకపోతే పోరుబాట.!

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్,23:


నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెం గ్రామ శివారు బ్రహ్మానందపురం దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దే పేరుతో మభ్యపెట్టి పేరెంట్స్ కమిటీతో సంతకాలు సేకరించి పాఠశాల లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను వక్కపట్ల వారి పాలెం లోని స్కూల్లో అనుసంధానం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆలస్యంగా తెలుసుకున్న కాలనీవాసులు.పాఠశాల తరలింపును తీవ్రస్థాయిలో ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. తామంతా రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఇంటి దగ్గర ఉన్న పాఠశాలలో తమ పిల్లలు సురక్షితంగా విద్యను అభ్యసిస్తున్నారని, రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వక్కపట్లవారి పాలెం స్కూలుకు పిల్లలను పంపించడం అంటే వారి ప్రాణాలతో చెలగాటమాడమేనని, రెండు కిలోమీటర్ల దూరంలో రెండు ప్రధాన రహదారులను దాటుకుంటూ స్కూల్ కి వెళ్లే క్రమంలో బావదేవరపల్లి ప్రధాన రహదారిపై ఒంజేసీ కు సంబంధించిన భారీ వాహనాలతో అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ప్రమాదాలు ఎదురైతే బాధ్యత ఎవరిది అంటూ ప్రశ్నిస్తున్నారు. భావదేవరపల్లి రోడ్డుపై సాక్షాత్తు గ్రామ సర్పంచి పిల్లలను స్కూలుకు తీసుకెళ్లే క్రమంలో ప్రమాదానికి గురై నెలల తరబడి మంచాన పడిన సంఘటనను గుర్తు చేశారు.వెనుకబడిన దళితులు ఇప్పుడిప్పుడే విద్య పట్ల అవగాహనతో స్కూల్స్ లో చేరి ప్రతిభ కనబరుస్తున్నారు అని,స్కూల్ ను వేరే చోటికి తరలించి వారి ప్రాణాలతో చెలగాటమాడే కంటే వారిని చదువు మాన్పిచ్చడమే వారికున్న ఒకే ఒక్క దిక్కు అని, మండల విద్యాశాఖ అధికారి వారికి,స్థానిక ఎమ్మెల్యే కి తమ గోడు వెల్లపుచ్చుకున్న ఏమాత్రం కనికరం చూపలేదని, కృష్ణా జిల్లా కలెక్టర్ వారికి సైతం స్కూల్ తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవలసినదిగా కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించామని,గ్రామ సర్పంచ్ జిల్లా విద్యాశాఖ అధికారి వారిని పాఠశాల తరలింపు ప్రక్రియను విరమించుకుని, దళిత విద్యార్థుల అభ్యున్నతికి సహకరించవలసిందిగా ఫోన్లో కోరగా జిల్లా విద్యాశాఖ అధికారి సర్పంచి పై ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. వెనుకబడిన దళిత పిల్లల భవిష్యత్తుతో చెలగాటలాడొద్దని,అలా కాకుండా తరలించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే దళితులంతా ఏకమై పోరుబాట పట్టి ఆందోళన ఉధృతం చేసి స్కూల్ యథాతరంగా కొనసాగించే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

# బుద్ధ విగ్రహాలకు స్వాగతం పలికిన మంత్రి - కొల్లు రవీంద్ర



**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,మచిలీపట్నం, ఏప్రిల్ 23:**

థాయిలాండ్ నుండి వచ్చిన బుద్ధ విగ్రహాలకు మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో బుధవారం స్వాగతం పలికారు.బుద్ధ ప్రాజెక్టులో భాగంగా ఘంటశాలలో ఏర్పాటు చేసేందుకు థాయిలాండ్ నుండి వచ్చిన బుద్ధ భగవానుని విగ్రహాలకు మచిలీపట్నం రైల్వే స్టేషన్ లో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర , ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించే బౌద్ధుని ఆశయాలకు అనుగుణంగా ప్రజలంతా నడచుకోవాలని ఆకాంక్షించారు. సమస్త జీవరాశిపైనా బుద్ధుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బుద్ధ భగవానుడి విగ్రహం ఎక్కడ ఉంటే అక్కడ ప్రశాంత వాతావరణం కనిపిస్తుందన్నారు. మయన్మార్ పర్యటనలో బుద్ధ భగవానుని దేవాలయాలను సందర్శించడం జరిగిందన్నారు. అప్పుడు నాకు మనసుకు చాలా శాంతి లభించినట్లుగా భావించానని తెలిపారు. గౌతమ బుద్ధుడు మనదేశంలో జన్మించటం మన అదృష్టమని, ప్రపంచంలోనే చాలా దేశాల్లో.. ఉదాహరణకు జపాన్, తైవాన్, థాయిలాండ్ తదితర దేశాల్లో బుద్ధ భగవానుడిని ఆరాధిస్తారన్నారు. బౌద్ధులు చాలా కఠిన నియమాలు పాటిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.





## పదవ తరగతి పరీక్షా ఫలితాలలో సంచలనాలు నమోదు చేసిన పందిళ్ళపల్లి హై స్కూల్ స్టూడెంట్స్



**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 22**

రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షా ఫలితాలు విడుదల కావడం జరిగింది. ఈ ఫలితాలలోవేటపాలెం మండలం పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, పందిళ్ళపల్లి లో చదువుతున్న సజ్జా దివ్యశ్రీ ఒక నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాల లో చదువుచూ రికార్డు స్థాయిలో 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి పందిళ్ళపల్లి హైస్కూల్ కు, గ్రామానికి, చీరాల నియోజక వర్గమునకు, బాపట్ల జిల్లాకి పేరు తీసుకుని రావడం జరిగింది. మార్కులు వరుసగా 99, 99, 98, 100, 100, 100. తరువాత ఉప్పాల నవ్య సుధ 591, పృధివి ధనుష్:589, కె శ్యామ సాయి శ్రీ : 589, కోడూరి స్వేచ్ఛ మణి: 589, పొగడ దండ శ్రావణి : 588, గుత్తి మోహిత్ విజయ్ కుమార్: 587 మార్కులు సాధించడం జరిగింది. 550 అంతకంటే పైగా మార్కులు సాధించిన వారు 20 మంది కలరు. 500 అంతకంటే పైగా మార్కులు సాధించిన వారు 27 మంది గలరు. మొత్తం 79 మంది స్టూడెంట్స్ పరీక్షలకు హాజరు కాగా 68 మంది పాస్ కావడం జరిగింది. స్కూల్ పాస్ పర్సంటేజీ 86. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఊటుకూరు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రొండా దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు మరియు గ్రామస్తులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు గ్రామానికి పేరు తెచ్చినందుకు విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

# మచిలీపట్నంకు సరికొత్త శోభగులు అద్దుతాం

డ్రైన్లలో పూడిక తొలగింపుకు రూ.171 కోట్లు.

పీపీపీ పద్దతిలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు.

శ్మశానాల అభివృద్ధికి డీపీఆర్ లు సిద్ధం.

మాతృభూమికి సేవ చేయడానికి ఎన్ఆర్ఐలు ముందుకు రావడం హర్షనీయం

డంపింగ్యార్డు స్థానంలో అక్టోబర్ 2 నాటికి నూతన పార్కు సిద్ధం చేస్తాం.

స్వదేశీదర్శన్ క్రింద రూ.120 కోట్ల ప్రపోజల్స్ పంపించాం.

మచిలీపట్నం అభివృద్ధికి అందరూ భాగస్వామ్యం కావాలి.



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్,23:**

మచిలీపట్నంను సరికొత్త రూపు సంతరించడానికి బ్యూటిఫికేషన్లో భాగంగా స్థానికతకు, కల్చర్కు పెద్దపీట వేస్తూ గోల్డ్ కవరింగ్, కళంకారీ, ఫిషరీస్ లుక్తో నూతన శోభను చేకూర్చుడానికి సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధిని చేసి చూపిస్తానన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో ఏడాదికి రూ.33 వేల కోట్లను పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకంలో భాగంగా దాదాపు కోటి మందికి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా 16 వేలకు పైగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ ఇప్పటికే ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. మచిలీపట్నం సంస్కృతిని చాటిచెప్పేలా పట్టణ పట్టణానికి సుందర రూపం చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నగరంలోని డ్రైన్లలో పూడిక తొలగింపునకు ఇప్పటికే టెండర్లు పిలిచామని, ఈ పనుల కోసం రూ.171 కోట్లు ఫైనాన్స్ అనుమతి కోసం వున్నాయని అనుమతులు రాగానే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామన్నారు. వీటికి అనుబంధంగా మరో రూ.13 కోట్లకు అనుమతులు రాగానే పనులు చేస్తామన్నారు. కాలువలు కూడా వీటి పారుదలకు అవరోధాలు లేకుండా శుభ్రం చేయిస్తామన్నారు. సీఎస్ఆర్ విధులు కూడా వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కోనేరు సెంటర్ మున్సిపల్ కార్యాలయం, బేబీ సెంటరీ, పాతకూరగాయల మార్కెట్ను పీపీపీ పద్దతిలో రూ.100 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. శ్మశానవాటికల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, ప్రధాన శ్మశాన ఆధునీకరణకు రూ.1.50 కోట్లు డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. ఈ మేరకు దాతలు ముందుకు వచ్చారవి, కమిటీ వేసి పనులు ప్రారంభించనున్నామన్నారు. అలాగే చిలకలపూడి శ్మశానాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు గ్రీన్ సంస్థ ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ ప్రాంత ఎన్ఆర్ ఐలు మాతృభూమికి సేవ చేసేందుకు ముందుకు వస్తున్నారని, అభివృద్ధి పనుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నామని, అవసరాల ప్రాధాన్యతబట్టి ఒక్కొక్కటి పూర్తి చేస్తామని వివరించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పీ-4లో భాగంగా బంగారు కుటుంబాలను గ్రామాల వారీగా గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. పేదరికంలో వున్న కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు మార్గదర్శులు సిద్ధంగా ఉన్నారని, పేదల అభివృద్ధి బాటలు వేయడానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధమే అన్నారు. నగర డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రం చేసి అక్టోబర్ 2 నాటికి సుందరమైన పార్కుగా రూపొందించనున్నామన్నారు. టూరిజం డేవలప్మెంట్ లో భాగంగా మంగినపూడి బీచ్ లో వర్షాకాలం అనంతరం టెంపరరీ టెంట్లు ఏర్పాట్లు చేయాలనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. స్వదేశీదర్శన్ క్రింద రూ.120 కోట్ల ప్రపోజల్ను ముఖ్యమంత్రి ద్వారా కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. అలాగే మరో వారం రోజులలో ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ను కలిసి మంగినపూడి బీచ్ ఫెస్టివల్ కు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. టూరిజం, పరిశ్రమలస్థాపనతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మచిలీపట్నం అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యులు అవ్వాలని, బందరుకు సరికొత్త రూపాన్ని సంతరించేందుకు తోడుగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీతారామపురం విద్యార్థిని విద్యార్థులు

**సీతారాంపురం పెన్ పవర్- ఏప్రిల్ 23**

10 వ తరగతి పరీక్షల ఫలితాలు. సీతారామపురం మండలము.ప్రభుత్వ పాఠశాలల్లో 82% ఉతీర్ణత సాధించారు.పరీక్షలు రాసినవారు:210,ఉతీర్ణత సాధించిన వారు: 172. మండల ప్రథమ స్థాయి సంగసాని గురుహాసిని,అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాల(మార్కులు:579),ద్వితీయ స్థాయి బండిసుర్ల జాస్మిన్, బసినేనిపల్లి ఉన్నత పాఠశాల(మార్కులు:576),తృతీయ స్థాయి బద్వేలి తేజస్విని,బసినేనిపల్లి ఉన్నత పాఠశాల(మార్కులు: 572).విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాభినందనలు,శుభాకాంక్షలు. షేక్ మస్తాన్ వలి,మండల విద్యాశాఖాధికారి, సీతారామపురం.

పెన్ పవర్

నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

# రేపటి నుండి పాఠశాలలకు సెలవులు

**మండలవిద్యాశాఖ అధికారి మస్తాన్ వాలి**



**సీతారామపురం పెన్ పవర్- ఏప్రిల్ 23**

రేపటినుండి అనగా 24 -04-2025 నుండి 11-06-2025 వరకు అన్ని యాజమాన్య పాఠశాలలకు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు వేసవి సెలవులు ప్రకటించడం జరిగింది తిరిగి పాఠశాల పునః ప్రారంభం 12-06-2025 తేదీన కావున వేసవి సెలవులలో ఎవరూ కూడా ప్రైవేటు తరగతులు నిర్వహించకూడదు నిర్వహించిన ఎడల తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడును.

# ఆర్ వి ఎస్ సి వి ఎస్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల విజయపరంపర

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23**



చిలకలూరిపేట : ఈరోజు ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 578 మార్కులతో అబ్దుల్ సుహాన కరీమ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. పరీక్షకు హాజరైన 51 మంది విద్యార్థులలో 550 మార్కులకు పైగా సాధించిన వారు ఐదుగురు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 19 మంది. ఈ సందర్భంగా ఈరోజు నిర్వహించిన అభినందన సభలో చిలకలూరిపేట విద్యా సంఘం ప్రెసిడెంట్ శ్రీ తేళ్ల సుబ్బారావు , సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మైలవరపు శివానంద కుమార్ , జాయింట్ సెక్రెటరీ బేతంచెర్ల రామకోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ షేక్ గౌషుల్ ఆజాం, అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులందరినీ అభినందించారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు విద్యార్థినీ విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేజీబీవీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత

**స్కూల్ టాపర్లుగా శివ మల్లికా బాయ్ 581, షేక్ హరీష, కౌసర్ 580, షేక్ కౌసర్ 573, 500 మార్కులకు పైగా 14 మంది విద్యార్థులు.**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

చిలకలూరిపేట : మండలానికి చెందిన పోతవరం కేజీబీవీ పాఠశాల పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 33 మంది విజయాన్ని సాధించారు. స్కూల్ టాపర్లుగా శివ మల్లికా బాయ్ 581 , షేక్ హరీష కౌసర్ 580,షేక్ కౌసర్ 573 సాధించారు .500మార్కులకు పైగా 14 మంది విద్యార్థులు ఉండడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అశ్రుఫున్ మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణతో అంకిత భావం కలిగిన ఉపాధ్యాయుల చే విద్య బోధన మా మార్కులకు నిదర్శనం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు .

# లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో 93.5శాతం ఉత్తీర్ణత

**స్కూల్ టాపర్లుగా నక్కా మేఘన 565, బి యశస్వినీ 563, ఎం స్వీటీ 563, కె అమృతవర్షిణి 555 మార్కులు**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

యడ్లపాడు : మండలానికి చెందిన లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో 93.5 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 46 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 43 మంది విజయాన్ని సాధించారు. పాఠశాల విద్యార్థులు నక్క మేఘన 565 మార్కులు, బి. యశస్విని 563 మార్కులు, ఎం. స్వీటీ 563 మార్కులు, కే. అమృత వర్షిని 555 మార్కులతో హై స్కూల్ టాపర్లుగా నిలిచారు. ఈ వివరాలను పాఠశాల హెచ్ఎం కెవి రామిరెడ్డి తెలిపారు.



# ప్రజల తలలో నాలుకలా వ్యవహరించండి

**పార్టీ, ప్రభుత్వ పనితీరుని ప్రజలకు వివరిస్తూ, మంచి గుర్తింపు పొందాలని పార్టీ నూతన కార్యవర్గానికి ప్రత్తిపాటి. సూచన**









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

ప్రజలు, రాష్ట్రం కోసం ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని, గత పాలకుల విధ్వంసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత తెలుగుదేశం శ్రేణులదేనని, పదవులు పొందినవారంతా జనం తలలో నాలుకలా వ్యవహరించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని 7వ వార్డుకు మరియు 19వ వార్డుకు నూతనంగా ఎన్నికైన తెలుగుదేశం కార్యవర్గాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో అభినందించిన మాజీమంత్రి, 7వ వార్డు అధ్యక్షుడు షేక్ బాజీ, కార్యదర్శి పాపారావు మరియు 19వ వార్డ్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, కార్యదర్శి ఏసుబాబు, సహా ఇతర సభ్యుల్ని సన్మానించారు. త్వరలోనే పట్టణంలోని అన్నివార్డులు, మండల, గ్రామస్థాయి కార్యవర్గాల ఎంపిక కూడా పూర్తవుతుందని, పార్టీ పదవులు పొందినవారు బాధ్యతతో ప్రజలకోసం పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. జనం కష్టసుఖాల్లో తోడుగా ఉండి, పార్టీ.. ప్రభుత్వ పనితీరుని వారికి వివరించాలని ప్రత్తిపాటి చెప్పారు. నిత్యం ప్రజలతో ఉంటూ, ఎప్పటికప్పుడు వారితో మమేకమయ్యేవారికి టీడీపీలో ఎప్పటికీ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కష్టపడే కార్యకర్తలను తెలుగుదేశం అమితంగా గౌరవించి ఆదరిస్తుందనే వాస్తవాన్ని నూతన కార్యవర్గం గుర్తుంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. భేషజాలు, పట్టింపులకు చోటులేకుండా స్వపక్షంతో పాటు, మిత్ర పక్షాల శ్రేణుల్ని కలుపుకొని ప్రజలకోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, పఠాన్ సమద్, ఏలూరి తిరుపతయ్య, మున్నంగి రత్నారెడ్డిగారు, నసిమా బేగం, షేక్ జాకీర్, సయ్యద్ రఫీ, షేక్ సైదు, షేక్ మస్తాన్ వలీ, గుర్రం శ్రీనివాసరావు, షేక్ జహంగీర్, షేక్ బషీర్ గారు, షేక్ కరీముల్లా, నూర్ భాషా సాయి ముత్తయ్య, సయ్యద్ వలి, షేక్ నాగూర్, సయ్యద్ అయేషా, పునాటి సుబ్బారావు పొన్నం సురేష్, షేక్ రియాజ్, బుడ్డయ్యకుంట కోటేశ్వరరావు, కృష్ణవేణి, మోమిన్, కరీముల్లా, శ్రీరామ్, ఖలీల్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు...

# మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 23:**

స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకులు ఎంవిడిటి నగేష్, గ్రంథాలయ సిబ్బంది పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. అనేక విషయాలకు సంబంధించిన పుస్తకాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్నాయన్నారు. పాఠకులు అభిరుచికి తగిన పుస్తకాలను చదవాలన్నారు. పరిషత్ కార్యదర్శి ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలను వివరించారు. గ్రంథ పాలకులు ఎం వి డి టి నగేష్ మాట్లాడుతూ పాఠకులు తమకు కావలసిన పుస్తకాలను తీసుకొనుటకు వీలుగా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్నం లాల్ బహుదూర్ శాస్త్రి, పలువురు ఉపాధ్యాయులు, డీఎస్సీ అభ్యర్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# టైర్ పంక్చర్‌తో డివైడర్‌ను ఢీకొన్న ట్రక్కు

**తప్పిన పెనుప్రమాదం..డ్రైవర్ సురక్షితం**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

జాతీయ రహదారిపై అదుపుతప్పిన ట్రక్కు డివైడర్‌పైకి వెళ్ళింది . బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నుంచి దర్శికి వెళున్న మామిడికాయల లోడుతో వెళ్తున్న ట్రక్కు యడ్లపాడు గ్రామంలోని హైవే ఉప్పవాగు పరిధిలో రాగానే వాహనం వెనుక టైర్ పంక్చర్ అయింది. వేగంగా ఉన్నందున ట్రక్కు అదుపుతప్పి రహదారి సెంట్రల్ డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో వాహనం ధ్వంసం కాగా, మామిడి కాయలు రోడ్డు పై డివైడర్‌పై చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపీరి పీల్చుకున్నారు. ఎస్ఐ టి శివరామకృష్ణ సిబ్బందితో వెళ్లి వాహనాన్ని డివైడర్‌ను, కిందపడ్డ మామిడి కాయలను తీయించారు.

# పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్



**పెన్ పవర్ కారంపూడి ఏప్రిల్ 23**

పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. కందుకూరి సంజీవరాజు 600 మార్కులు గాను 588 మార్కులు సాధించారు. పల్లె మహేశ్వరి 600 మార్కులు గాను 586 మార్కులు సాధించారు సురే వైష్ణవి 600 మార్కులు గాని 583 మార్కులు సాధించారు అనీ పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ మర్రి అనిల్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బినోమ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్ము కాశ్మీర్ లో మానవత్వం మీద జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం

**చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**



చిలకలూరిపేట : జమ్ము కాశ్మీర్లోని పహల్గాం లో అమాయకులైన యాత్రికుల మీద పాశవికంగా, పైశాచికంగా జరిపిన ఉగ్రవాదుల దాడిని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ ఖండించారు. మతోన్మాదం పెట్రేగితే మిగిలేది మారణ హోమమే అని దానికి ప్రత్యక్ష నిదర్శనం పహల్గాములో జరిగిన దాడేనని ఆవేదనతో అన్నారు. మతాలు మానవత్వాన్ని ప్రబోధిస్థాయి కానీ మారణ హోమాలను సృష్టించవని కొద్దిమంది అరాచక వాదుల కారణంగా ఇలాంటి దుస్సంఘటనలు జరిగి మతసామరస్యానికి విఘాతం కలుగుతుందని అన్నారు. పాలకులు నిష్పక్షపాతంగా అన్ని మతాలు అన్ని కులాలు అన్ని భాషలు అన్ని ప్రాంతాల వారిని సమానంగా ప్రేమించడం ద్వారానే ఇటువంటి సంఘటనలు జరగకుండా నిరోధించవచ్చని అన్నారు. ఉగ్రవాదులు దాడిలో అమాయకులు బలి కావడం అత్యంత బాధాకరమని అన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మతసామరస్యం ప్రజల్లో ఐక్యతా సాధన కోసం కృషి చేయడం ద్వారానే దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను నియంత్రించే అవకాశం ఉంటుంది అని అన్నారు . కాశ్మీర్లో ఉగ్రవాదులు దాడి చేయడం ద్వారా విసిరిన సవాల్ ను అన్ని రాజకీయ పక్షాలు ఒక్కటై ఎదుర్కోవలసిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని రాధాకృష్ణ అన్నారు..

# పర్యాటకులను దారుణంగా హతమార్చిన ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం : రాజా రమేష్

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23:**

జమ్మూ కాశ్మీర్ లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు తెగబడి 28 మందిని హతమార్చటాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ మూడు రోజులు పాటు సంతాపదినాలు పాటిస్తుంది. అందులో భాగంగా బుధవారం ఉదయం చిలకలూరిపేట జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజా రమేష్ జనసేన పతాకాన్ని అవతన%ళి% చేశారు. ఈ సందర్భంగా రాజా రమేష్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో 28 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన సంఘటన చాలా బాధాకరమని అన్నారు. ఉగ్రవాదులు చేసిన ధోరణినీ యావత్ భారతదేశం కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఖండించి, చనిపోయిన కుటుంబాలకు అండగా నిలవాలని అన్నారు.ఇటువంటి సంఘటనలు మరొకసారి జరక్కుండా చూడాలని , చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు జనసేన పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు.ఈ జిల్లా నాయకులు షేక్ సుభాని, మునీర్ హసన్, పఠాన్ ఖాదర్ బాషా, ఆముదాల లీలా కిషోర్, కూరపాటి శివశంకర్, ముద్దా యోబు, కరిముల్లా, వెంకటస్వామి, సాంబ వీర మహిళలు అమరేశ్వరి, ప్రసన్నలక్ష్మి, పరమేశ్వరి, సరళ, సుష్మ మరియు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈదర హరిబాబును పరామర్శించిన ముత్తుముల



గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23

ఒంగోలు పట్టణంలో మంగళవారం గుండెపోటుకు గురై సంఘమిత్ర హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి బుధవారం నాడు ఒంగోలు కు వెళ్లి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలిసి పరామర్శించారు వీరితో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే శ్రీ బి.ఎన్ విజయ్ కుమార్, లు పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని మెరుగైన వైద్యం అంధిస్తున్నామని డాక్టర్లు తెలిపారు.

## చుండి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం





వలేటివారిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 23

బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో చుండి ఆదర్శ పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం అద్భుతమైన ఫలితాలను సాధించి అదుర్స్ అనిపించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు బోడ నవ్య శ్రీ 600గాను 592 మార్కులు, ప్రగడ రాకేష్ 600గాను 591, చెరువుపల్లి హృత్విక సాయి కోటి 600గాను 591 ఎర్రమాసు జై సంహిత 600 గాను 591 మీసాల మనోయజ్ఞం 591మార్కులు సాదించారు . 500 పైగా మార్కులు 62 మంది సాదించారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేశ్వర్ విద్యార్థులకు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు . విద్యార్థుల శ్రమకి తగిన ఫలితం లభించిదని కొనియాడారు . గతంలో కూడా చుండి పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇంతటి విజయాని సాధించిన విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ప్రత్యేక శు భాకాంక్షలు తెలియజేశారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి




గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23

జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ యాత్రికులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ తీవ్రంగా ఖండించారు . గిద్దలూరు పట్టణంలో బుధవారం సాయంత్రం ఉగ్రమూకల దాడిలో మరణించిన వారికి సంతాప సూచకంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ శంకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని కోరారు. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్ లో పర్యటక రంగం అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేని పాకిస్థాన్ ఉగ్రవాదులను ప్రేరేపించి పర్యాటకులను చంపడం పిరికి పంద చర్యగా భావించారు. పాకిస్థాన్ పై తీవ్రమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఉగ్రవాదానికి సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో హిందూ సంఘాల నాయకులు పోలంరెడ్డి బాలకృష్ణారెడ్డి, చేరెడ్డి ఎర్రారెడ్డి,శివపురం మురళీకృష్ణ, ఆర్ ఎస్ ఎస్ జిల్లా నాయకులు ఎస్ వి కృష్ణారావు, బిజెపి నాయకులు ముప్పూరి శ్రీనివాసులు పలువురు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలలో స్పందన విద్యార్థుల విజయదుంధుభి.

గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాచర్ల స్పందన విద్యా సంస్థల్లో ని విద్యార్థులు విజయ భేరి మోగించారు.తమ లక్ష్యం. కేవలం ఒకరితో మాత్రమే మంచి మార్కులు సాధింపచేయడం కాకుండా.. ఎక్కువమంది విద్యార్థులతో మంచి మార్కులు సాధింపజేయడం మా విద్యాసంస్థ ప్రత్యేకత యని ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు12 మంది. 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు22 మంది. ఉన్నారన్నారు. పదవ తరగతి ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఘన విజయానికి సహకరించిన తల్లితండ్రులకు కృత్ఞతలుతెలిపారు.సాధారణ గ్రామీణ ప్రాంత విద్యార్థులతో అసాధారణ, గర్వించదగ్గ మార్కులు సాధింపజేసిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలుతెలియజేశారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు








పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 22

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఘన విజయం సాధించారు. పెద్ద దోర్నాల మండల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల షేక్. బషీర్ అను విద్యార్థి 600 మార్కుల గాను 588 మార్కులు సాధించి పెద్ద దోర్నాల మండలంలోనే ఉన్నత స్థానంలో నిలిచాడు. పెద్ద దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షేక్ . మాజ్ 576 మార్కులు సాధించి సత్తా చాటారు.షేక్. చాందిని, షేక్. అస్మత్ 574 మార్కులు సాధించారు. అలాగే పాఠశాలో 40 మంది బాల,బాలికలు 500 మార్కులు పైన సాధించి అద్భుతమైన ప్రతిభను కనపరిచారు. 190 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా ఇందులో 157 మంది ఉత్తీర్ణులై 83 శాతం సాధించారు . 120 మంది ఫస్ట్ క్లాస్ పాస్



అయ్యారు. 26 మంది సెకండ్ క్లాస్ పాస్ అయ్యారు. 11 మంది థర్డ్ క్లాస్ లో పాసయ్యా. పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటి , ప్రథమ స్థానంలో నిలిచిన షేక్ . బషీర్ ను మరియు వారి తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనసూయదేవి, స్టాఫ్ సెక్రటరీ నాగమూర్తి, సీనియర్ ఉపాధ్యాయురాలు విజయ మాణిక్యం, కిరణ్ కుమార్ , పోలయ్యా, మీటే నాయక్, వెంకట శివ కుమారి, చంద్రమౌళి, శిరీష రాణి,పి. రామా నాయక్, హెచ్ . రామా నాయక్,ఆంజనేయులు, ఆవులయ్యా, ప్రసాద్, అనిత, రసూల్, నరేష్, ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు, విద్యార్థులను పాల్గొని హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## డిగ్రీ ఫలితాలలో
# శ్రీ హర్షిణి యూనివర్సిటీ ఫస్ట్



కే.సంధ్య (BCA) | డి.మానస (BCOM) | ఎస్.అమూల్య (COMP) | వి.ప్రవళిక(MATHS) | బి.అభిషేక్(BA) | బి.రామాంజనేయులు(ZOO)

క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 23

ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో మొదటి సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదల అయినాయి. అందులో శ్రీ హర్షిణి డిగ్రీ విద్యార్థులు యూనివర్సిటీ మొదటి ర్యాంకు సాధించి విజయ ఢంకా మోగించారు. బి సి ఏ విభాగంలో కే సంధ్య 8.88 గ్రేట్ పాయింట్లతో మొదటి స్థానం, వి కృష్ణ లాస్య 8.82 పాయింట్లతో రెండవ స్థానం, సిహెచ్ అశ్విని 8.60 పాయింట్లతో మూడో స్థానం సాధించారు. బిఎస్సి కంప్యూటర్స్ విభాగంలో ఎస్ అమూల్య 8.75 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానం సాధించారు. డి ఉదయ్ కౌశిక్ 8.64 పాయింట్లతో రెండవ స్థానం, డి విక్టోరియా 8.61 పాయింట్లతో మూడవ స్థానం సాధించారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో డి మానస 8.67 గ్రేట్ పాయింట్లతో మొదటి స్థానం, డి దివ్య 8.30 పాయింట్లతో రెండవ స్థానం, డి వైష్ణవి 8.28 పాయింట్లతో మూడవ స్థానం సాధించారు. బీఎస్సీ ఆక్వా కల్చర్ విభాగంలో కే లావణ్య 7.88 పాయింట్లతో మొదటి స్థానం, ఎన్ నాగమణి 7.21 పాయింట్లు రెండవ స్థానం, పి ధనుష్ 7.14 పాయింట్లతో మూడో స్థానం సాధించారు. బీఎస్సీ కెమిస్ట్రీ విభాగంలో జి లేఖన 8.08 పాయింట్లతో మొదటి స్థానం, జి నిత్య 7.90 పాయింట్లతో రెండవ స్థానం,ఏ వెంకట జ్యోతి 7.16 గ్రేడ్ పాయింట్లతో మూడవ స్థానం సాధించారు. బి బి ఏ విభాగంలో కే వెంకటలక్ష్మి 7.70 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానం, వై స్పందన 7.14 పాయింట్లతో రెండవ స్థానం, ఎం మోహన మహతి 7.10 పాయింట్లతో మూడో స్థానం సాధించారు. బీఎస్సీ జువాలజీ విభాగంలో బి రామాంజనేయులు 8.53 లతో మొదటి స్థానం, పి శ్రీలక్ష్మి 8.48 పాయింట్లతో రెండవ స్థానం, బి మోజేష్ 8.46 పాయింట్లతో మూడవ స్థానం సాధించారు. బీఎస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో వి ప్రవళిక 8.50 పాయింట్లతో మొదటి స్థానం, ఎం మందిరా రెడ్డి 8.21 పాయింట్లతో రెండవ స్థానం, పి హర్షిని 8.09 గ్రేడ్ పాయింట్లలో మూడవ స్థానం సాధించారు. బీఎస్సీ బోటనీ విభాగంలో ఆర్ లక్ష్మీ గంగోత్రి 8.27 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానం, ఎం కృప 7.88 పాయింట్లతో రెండవ స్థానం, కే జయలక్ష్మి 7.32 లతో మూడవ స్థానం సాధించారు. బిఏ విభాగంలో బి అభిషేక్ 7.97 పాయింట్లతో మొదటి స్థానం, కే ఇందు 7.72 పాయింట్లు రెండవ స్థానం, కె జోసెఫ్ రత్నకుమార్ 7.55 లతో మూడవ స్థానం సాధించారు.ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్ ను కూడా నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. దీనికి కారణం కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుండి కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీ చేరిన విద్యార్థికి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ దృష్టిలో ఉంచుకొని మరియు క్యాంపస్ ప్లేస్మెంట్స్ కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ మొదటి సంవత్సరం నుండి డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా నేర్పించడం జరుగుతుంది అని తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధిరీష్ , ప్రతాప్, శంకర్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ హర్షిణి విద్యార్థుల ప్రభంజనం



కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23

బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మార్టూరు శ్రీ హర్షిణీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ సాధించారు. జొన్నలగడ్డ భాను ప్రత్యూష అను విద్యార్థిని 592 / ,600 మార్కులతో టౌన్ ప్రథమ స్థానాన్ని సాధించింది రావుల నీరజ చౌదరి 590 / 600 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించారు, జి. వినీల్ కృష్ణ కార్తీక్ 588 / 600 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు 550 పైగా మార్పులు సాధించిన విద్యార్థుల సంఖ్య 15 మంది. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 23 మంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ మార్టూరు ప్రాంతంలో కూడా తక్కువ మంది విద్యార్థులతో కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా విద్యను బోధిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణీ అని తెలియజేశారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆంజనేయులు, నిర్మలా, విద్యాసంస్థల ఏఓ అజయ్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# అల్లినగరం హై స్కూల్ ను నిరాశపరచిన టెన్త్ పరీక్ష ఫలితాలు

*ఊహించని ఫలితాలతో నిరాశ కు గురైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు.*

*కేవలం 40 శాతం ఉత్తీర్ణత తో తృప్తి పడవలసిన పరిస్థితులు.*

*పరీక్షా ఫలితాల విశ్లేషణలో ఉపాధ్యాయులు.*

కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 23

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు కొమరోలు మండలం అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. గత ఏడాది కంటే ఏడాది పాఠశాలకు మంచి ఫలితాలు వస్తాయని ఆశించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామికి, ఉపాధ్యాయులకు బుధవారం ప్రకటించిన ఫలితాలు నిరాశకు ఆవేదనకు గురిచేసాయి. గత నెలలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే వారిలో కేవలం పదిమంది మాత్రమే హాజరయ్యారు .దీనితో ఆ పాఠశాలకు 40 శాతం ఉత్తీర్ణత లభించినట్లయింది. ఆ పాఠశాలకు మొదటి ర్యాంకుగా



483 మార్కులు, రెండవ ర్యాంకుగా 481 మార్కులు, మూడో ర్యాంకు 400 మార్కులు లభించాయి. గత ఏడాది నిర్వహించిన పరీక్ష ఫలితాలలో ఆ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పాఠశాల గత చరిత్రను తిరగరాశారు. అయితే ఈ ఏడాది గత ఏడాదికి మించి మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల పేరు ప్రఖ్యాతులు జిల్లా స్థాయిలో నిలిచిపోతాయని, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి,




ఉపాధ్యాయులు ఆశించారు. అయితే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు వారి ఆశలపై నీళ్లు చల్లుతూ తీవ్ర నిరాశకు గురిచేసాయి. తమ పాఠశాలకు పరీక్ష ఫలితాలు దిగజారి పోవడానికి గల కారణాలను ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విశ్లేషణ చేసే పనిలో పడ్డారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. అయితే ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలకు మంచి ఉత్తీర్ణత సాధించిపెట్టి తృప్తికరంగా, సంతోషంగా ఉద్యోగ విరమణ చేయాలని ఆయన ఆశించారు. అయితే ఆయన కన్న కలలు కలలుగా మిగిలి గురు స్వామికి తీవ్ర నిరాశ మిగిల్చాయని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి, సప్లిమెంటరీ పరీక్షలలో వారందరూ తప్పనిసరిగా పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకొని పాఠశాల పేరు ప్రఖ్యాతలు నిలపాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

# 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఆక్స్ఫర్డ్ విద్యార్థుల విజయ ఢంకా







**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 23**

పట్టణంలోని పామూరు రోడ్ లో గల బిఆర్ ఆక్స్ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు బుధవారం విడుదలైన 2025 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో అద్భుత ఫలితాలు సాధించారని ఆక్స్ఫర్డ్ విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామా రక్షణ (594/600) టౌన్ ఫస్ట్ గా నిలిచిందని, అలాగే షన్విత హాసిని (593) , వేదశ్రీ (592), అమూల్య (592), యువ సంజయ్ (592) వంటి అత్యుత్తమ మార్కులు సాధించారని, అలాగే 590 పైగా మార్కులు 17 మంది, 580 కి పైగా మార్కులు 40 మంది, 550 కి పైగా మార్కులు 97 మంది, 500 కు పైగా మార్కులు 181 మంది విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి నరేంద్రబాబు లు ప్రత్యేకంగా అభినందించారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ సంస్కృతి ప్రభంజనం





**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 23**

బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీ సంస్కృతి విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని చైర్మన్ కొంకా చంద్రశేఖర్ తెలిపారు. కందుకూరు శ్రీ సంస్కృతి స్కూల్ విద్యార్థులు అనతికాలంలో మా దగ్గర ఉన్న తక్కువ మంది విద్యార్థుల తోనే మార్కుల ప్రభంజనం సృష్టించారు అని అన్నారు.కోడూరి జశ్వంత్ రెడ్డి 600 మార్కులు గాను 593, కొరివి సత్య భవ్య శ్రీ 590 మార్కులు సాధించారని తెలిపారు. 550పైన సాధించిన మా విద్యార్థులు 20మంది, 500పైన సాధించిన మా విద్యార్థులు 41 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. పరీక్ష రాసిన 68 మందిలో ప్రతి నలుగురిలో ముగ్గురికి 500 పైన సాధించిన ఏకైక విద్యాసంస్థ శ్రీ సంస్కృతి మాత్రమే అని సగర్వంగా తెలియజేశారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులకు విద్యార్థులకు అధ్యాపక బృందానికి చైర్మన్ కొంకా చంద్రశేఖర్ అభినందనలు తెలియజేశారు.

# పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ శివసాయి జయకేతనం



**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీ శివసాయి హైస్కూల్ విద్యార్థులు విజయభేరి మ్రోగించారు అని కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య తెలిపారు. ఈ పరీక్షా ఫలితాలలో స్కూల్ ఫస్ట్ మార్క్ కె హిమశ్రీ -590, స్కూల్ సెకండ్ మార్క్ దీపిక, కళ్యాణి-581, లిఖిత - 576 మార్కులు సాధించినట్లు తెలియ చేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ శివరామయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాలలో నారాయణ విద్యార్థుల ప్రతిభ



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

స్థానిక కందుకూరు లోని కోవూరు రోడ్డు లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో అత్యంత ప్రతిభ ను కనబరిచారు. అత్యధిక మార్కులు సాధించిన మా విద్యార్థులు అనురూప్ 592మార్కులు, శ్రీ చరిత 590మార్కులు, జె. అఖిల్ 590మార్కులు సాధించారు. అంతే కాకుండ అత్యధిక అవరేజ్ 553.4మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ను నారాయణ పాఠశాలల ఏ జీ యమ్ పెద్దిరెడ్డి , క్లస్టర్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి , ప్రిన్సిపాల్ ఎస్ కె యమ్ సుభాని, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియ జేశారు.

# పదో తరగతి పరీక్షా ఫలితాలలో సిద్ధార్థ విజయభేరి





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారని కరస్పాండెంట్ గొర్రెపాటి రామారావు తెలిపారు. 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించిన సిద్ధార్థ ఆణిముత్యం అనుమాల వర్షను సిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి రామారావు, సిద్ధార్థ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు అధ్యాపక బృందం అభినందించారు. 550 కి పైగా మార్కులు సాధించిన మా ఆణిముత్యాలు 22 మంది, 500 కి పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 36 మంది, ప్రతి ఇద్దరిలో ఒక్కరు 500 కు పైగా మార్కులు సాధించారు. విద్యార్థులందరికీ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ జి. రామారావు మాట్లాడుతూ, ఈ సంవత్సరం మా విద్యార్థులు సాధించిన విజయం మమ్మల్ని ఎంతో సంతోషానికి గురి చేసింది. వారి యొక్క అకుంఠిత దీక్ష, క్రమశిక్షణ, మా సిబ్బంది యొక్క నిరంతర ప్రోత్సాహం ఈ అద్భుతమైన ఫలితాలకు కారణమయ్యాయి. ప్రతి ఒక్క విద్యార్థి తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని విజయపథంలో పయనించడం మాకు గర్వకారణం అని అన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థలు భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి విజయానికి తోడ్పాటునందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము విజయం సాధించిన విద్యార్థులందరికీ మా హృదయపూర్వక అభినందనలు అని అన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

వాహనదారుల ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనల పాటించాలని ప్రాంతీయ రవాణా శాఖ అధికారి లక్ష్మీ సూచించారు.ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టి.వి.యన్ లక్ష్మీ ఆధ్వర్యం లో పామూరు బస్టాండ్ సర్కిల్ నందు వాహనములపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కందుకూరు మోటారు వాహనముల తనిఖీ అధికారి చెన్నూరి రాంబాబు వాహన చోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి అదేవిధంగా వాహనముల యొక్క ధ్రువపత్రాలను పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా సీటు బెల్ట్ లేకుండా ప్రయాణం చేయుచున్న 2 మోటారు కార్ వాహనములను, పరిమితిని మించి ప్రయాణం చేయుచున్న 2 ఆటో రిక్షాలకు, ఒక గూడ్స్ వాహనములకు డ్రైవింగ్ లైసెన్స్ లేని కారణముగా కేసు నమోదు చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ రవాణశాఖాధికారి టివియన్ నాగ లక్ష్మీ వాహనచోదకులకు రహదారి భద్రత పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనమును నడుపునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు వాహనములలో ఉంచుకోవలసిన ధృవీకరణ పత్రముల గురించి తెలియచేస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తరువాతనే వాహనములను నడుపవలెనని తెలియచేశారు.

# విజ్ఞాన్ విహార్ లో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో విజయదుందుభి

**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 23**

క్రమశిక్షణలోనే కాకుండా పరీక్షా ఫలితాలలో కూడా తమ విద్యార్థులు ముందుంటారని మరొకసారి నిరూపించారని విజ్ఞాన్ విహార్ స్కూల్ కరస్పాండెంట్ గట్టమనేని హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో విజ్ఞాన్ విహార్ విద్యార్థులు తమ ప్రతిభ చాటారని తెలిపారు.పి. జ్ఞాన మేఘన - 590, డి. అభినాష్ - 586,కె. శ్రీలక్ష్మి ప్రియాంక- 584, టి. లక్ష్మీ దీక్షిత-583 ,ఎ. మణి కంఠ- 582 మార్కులు సాధించారని, 500 పైగా మార్కులు 45 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. పరీక్ష రాసిన ప్రతి ఇద్దరిలో ఒకరికి 500 పైన సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘనవిజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, విద్యార్థినీ, విదార్థులను, అధ్యాపక బృందాన్ని హరిబాబు అభినందించారు.





# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ సాయి సిద్ధార్థ ప్రభంజనం

**వలేటివారిపాలెం పెన్ పవర్, ఏప్రిల్ 23**

బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ సాయి సిద్ధార్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ మాధవరావు తెలిపారు. 600 మార్కులకు గాను ఎం. రక్షిత 593 మార్కులు, సుష్మ 586, జాహ్నవి 586, శ్రీధర్ రెడ్డి 584 మార్కులు సాధించారని తెలిపారు. గ్రామీణ ప్రాంత సాధారణ విద్యార్థులను రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించే విధంగా తీర్చిదిద్దినట్లు మాధవరావు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మాధవరావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# 10వ తరగతి పరీక్షా ఫలితాలలో నాగార్జున ప్రభంజనం

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ షాలిని రెడ్డి తెలిపారు. షేక్ హీన 600 మార్కులు గాను 589 మార్కులు, ఈదర లక్ష్మీ అనన్య 585 మార్కులు, దీపిక 578, శ్రీనాథ్ 575 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా షాలిని రెడ్డి మాట్లాడుతూ రోబోటిక్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు పరిజ్ఞానం అందించుట నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రత్యేకత అని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని 10వ తరగతి విద్యార్థులకు పరిమితి సీట్లు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ బాల బ్రహ్మం, మర్రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

# 10వ తరగతి ఫలితాలలో కేజీబీవీ ప్రతిభ





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

బుధవారం విడుదల అయిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కెజిబివి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. 600 మార్కులు గాను 539 మార్కులతో ప్రేమ వాణి స్కూల్ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. యాసశ్రీ 520 మార్కులతో స్కూల్ సెకండ్ సాధించినట్లు తెలిపారు. అడస్స 519 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ స్వాతి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# 26 న బెస్తవారిపేట మండల సర్వసభ్య సమావేశం

**బెస్తవారిపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23**

ఈనెల 26వ తేదీ శనివారం బేస్తవారిపేట మండలం సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు వేగినాటి ఓసురారెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని బేస్తవారిపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి రంగనాయకులు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో ప్రధాన శాఖలపై సమీక్ష సమావేశం లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే మండల పరిషత్ అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అంశములపై సమీక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశానికి మండలంలోని అందరు మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జడ్పిటిసి సభ్యులు, మండల కో ఆప్షన్ మెంబర్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు హాజరుకావాలని కోరారు. మండలంలోని గ్రామస్థాయి అధికారులు మరియు మండల స్థాయి అధికారులు విధిగా పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ రంగనాయకులు తెలిపారు.

# జోరుగా బెట్టింగ్...

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ భూతం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. ఎంతోమంది యువత ఆయుష్షును అర్థాంతరంగా ముగిసేలా చేసింది. ఇక ఏపీలోని చాలా బార్‌లలో రోజూ బెట్టింగ్ నడుస్తుంది. ప్రతీదగ్గర స్క్రీన్‌లు వేసి బెట్టింగ్‌లు జోరుగా నడిపిస్తున్నారు. దీంట్లో ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వాళ్లవే బార్లు, వాళ్లవే బెట్టింగులు అని తెలుస్తోంది. ఉదాహరణకు ఏలూరులో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బార్ ఉంది. ఓపెన్ ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.దీనిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఫలితంగా ఆన్ లైన్ బెట్టింగ్ కాస్త తగ్గింది. కానీ.. ఇన్నాళ్లు బెట్టింగ్ దోపిడీకి పాల్పడ్డ ముఠాలు ఇప్పుడు కొత్త దారిని ఎంచుకున్నాయి.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌పై గట్టి నిఘా ఉంది. దీంతో బుకీలు రూచ్ మార్చి.. మళ్లీ పాత పద్ధతిని ఎంచుకున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ-తెలంగాణ సరిహద్దు పట్టణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, వైరా ప్రాంతాల్లో గుట్టుగా బుకీలు దందా సాగిస్తున్నారు.ఇటు నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు అటు ఏపీ నుంచి ఇటు తెలంగాణ నుంచి బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బార్లు, చాయ్ కేఫ్‌లు, రెస్టారెంట్లు,



లాడ్జీలు ఆఫ్ లైన్ బెట్టింగ్‌కు వేదికలయ్యాయి. చాలా రోజులుగా పోలీసులు ఈ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై ఫోకస్ పెట్టడం లేదు. దీంతో బుకీలు రెచ్చిపోతున్నారు.ఆఫ్ లైన్ బెట్టింగ్ స్పాట్‌కు తక్కువ మంది వెళ్తున్నారు. అక్కడ ఉన్న బుకీలు, బ్రోకర్లు అమాయకులకు ఫోన్లు చేసి బెట్టింగ్ పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ విష సంస్కృతి మారుమూల పల్లెలకూ పాకింది. నెలకు రూ.10 వేలు సంపాదించే వారు కూడా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలవుతున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, వికెట్ టు వికెట్.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చెప్పలేని తిప్పలు పడుతున్నారు.ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనధికారిక వ్యక్తులు లేదా సంస్థలు బెట్టింగ్ నిర్వహిస్తే, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది. గెలిచినప్పటికీ, వారు చెల్లించకపోవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఎంత మొత్తం బెట్ వేస్తున్నారో ట్రాక్ చేయడం కష్టం. ఇది ఎక్కువ నష్టపోయేలా చేస్తుంది. బెట్టింగ్ వ్యసనంగా మారితే.. అది వ్యక్తిగత, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆఫ్‌లైన్‌లో ఈ వ్యసనం మరింత వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

# అనంత వైసీపీలో వర్గపోరు



**అనంతపురం, ఏప్రిల్ 23, పెన్ పవర్:** అనంతపురం ఉమ్మడి జిల్లాలో పెనుగొండ తెలుగుదేశం పార్టీకి అత్యంత పట్టున్న నియోజకవర్గం. అలాంటి చోట 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయం లోనే పెనుకొండ లో కూడా మొట్టమొదటి సారి వైసిపి బోణీ కొట్టింది. దీంతో సరాసరి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయనకీ సైతం జగన్ రెడ్డి మంత్రి పదవి కూడా కట్టబెట్టారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే జరిగింది. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్న చందంగా జగన్ రెడ్డి చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. అనంతరం 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ కాదని అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్‌నుకు చాన్స్ ఇచ్చారు. పెనుగొండ నియోజకవర్గం బీసీకి ( కురుబ ) కంచుకోట అలాంటి నియోజకవర్గంలో ఎప్పుడు తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తూ వచ్చింది. వైయస్ ఆర్ పార్టీ ఆవిర్భావం నుంచి కూడా జగన్మోహన్ రెడ్డికి వెన్నంటే ఉంటూ వస్తున్న కృప శంకర్ నారాయణ కు 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి జగన్ బరిలో నిలిపాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బి కే పార్థసారధి పై శంకర్ నారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం శంకర్ నారాయణ కు జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవిని కూడా కేటాయించారు. 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ ను అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా బరిలోకి దింపి అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ ను పెనుగొండ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. కానీ ఆమె పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైయస్సార్సీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. బలమైన అభ్యర్థి శంకర్ నారాయణ కాదని ఉషాశ్రీ చరణ్ కు టికెట్ కేటాయించినప్పటి నుంచి కూడా పెనుగొండ నియోజకవర్గం లో వర్గ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్చార్జిను మార్చాలన్న ప్రతిపాదన జగన్ వరకు వెళ్లినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఉషశ్రీ చరణ్ శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షురాలుగా కూడా కొనసాగుతున్నారు. పెనుగొండ నుంచి పరిటాల రవీంద్ర మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. ఆయన హత్య తర్వాత రవి భార్య పరిటాల సునీత ఒక్కసారి పెనుగొండ నుంచి గెలుపొందారు. మొత్తంగా ఇప్పటివరకు 8 సార్లు పెనుగొండ నుంచి టీడీపి విజయం సాధించింది. ఉషాశ్రీచరణ్‌ను పెనుగొండకు మార్చిన జగన్ 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి శంకర నారాయణ వైసీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత పరిణామాలు మారిపోయాయి. అనంతపురం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన శంకరనారాయణ.. తిరిగి పెనుకొండ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పదవి ఆశిస్తూ పావులు కదుపుతున్నార%స్త్ర%. మండల స్థాయిలో తన వర్గీయులతో సమావేశాలు పెట్టి మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారంట. పార్టీ అధ్యక్షుడు జగన్, ఇతర పార్టీ పెద్దల వద్దకు వెళ్లి నియోకవర్గ ఇన్చార్జ్ పదవి శంకర్ నారాయణకే ఇవ్వాలని పెనుగొండ సెగ్మెంట్ పరిధిలోని మండలాల నేతలు వత్తిడి తెస్తున్నారు. ఉష శ్రీ చరణ్ హైకమాండ్ దగ్గర తన పలుకుబడిని ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ శంకరనారాయణ వర్గీయుల్ని కొందర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. దాంతో పెనుగొండలో వారద్దరి మధ్య పరిస్థితి ఉప్పునిప్పులా తయారైందంటున్నారు . ఎప్పుడో వచ్చే ఎన్నికల కోసం వారిద్దరు అలా కుస్తీ పడుతుంటే.. ఇటీవల వారిద్దరికి పోటీగా మూడో వ్యక్తి సీన్లోకి వచ్చి ఇన్చార్జ్ పదవి కోసం పోటీ పడుతున్నారంట. ఉషాశ్రీ, శంకరనారాయణలను పెనుగొండ వైసీపీలో సైడ్ చేయడానికి శిల్పా అనే కొత్త నాయకురాలు ప్రయత్నిస్తున్నారనీ టాక్ నడుస్తోంది. ఇప్పటికే పెనుగొండ లో ఇద్దరు మాజీ మంత్రులు శంకర్ నారాయణ , ఉష శ్రీ చరణ్ లు రెండు వర్గాలుగా వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇన్చార్జ్‌గా ఉష శ్రీ చరణ్ ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతున్నారని పార్టీ క్యాడర్ ఆరోపణలు గుప్పిస్తోంది.. ఈ క్రమంలో పెనుగొండ నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలను పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా పరిష్కారం చూపుతాడో వేచి చూడాల్సి ఉంది.

# తెరపైకి బల్లం సుధీర్ పేరు

**కడప, ఏప్రిల్ 23, పెన్ పవర్:** వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కెసిరెడ్డి ఎట్టకేలకు అరెస్టయ్యారు.రాజ్ కెసిరెడ్డి రాజేష్‌రెడ్డి అనే మారు పేరు, నకిలీ గుర్తింపు పత్రాలతో గోవా నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌లో దిగారు. విమానాశ్రయంలో అప్పటికే మాటు వేసిన సిట్ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసినట్లు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. శంషాబాద్ నుంచి రాత్రి 11.10 గంటలకు ఆయన్ను విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు కాగా రాజ్ కెసిరెడ్డి.సిట్ జారీ చేసిన నోటీసుల చట్టబద్ధతను సవాల్ చేస్తూ, ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటి విచారణలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఆయనపై లుకౌట్ సర్క్యులర్ జారీ అయింది. మరోవైపు రాజ్ కెసిరెడ్డి విచారణకు ఏ మాత్రం సహకరించకపోవటంతో.. ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, బినామీలు, మద్యం కుంభకోణం సొత్తును పెట్టుబడులుగా పెట్టిన సంస్థలు, వాటి డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో సిట్ అధికారులు ఇటీవల వరుసగా

3 రోజులపాటు సోదాలు నిర్వహించారు. కీలక పత్రాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన తండ్రి ఉపేంద్రరెడ్డికి నోటీసులిచ్చారు. ఇలా అన్ని వైపుల నుంచి అష్టదిగ్బంధం చేయడంతో తప్పించుకోవటం సాధ్యం కాదని గుర్తించిన రాజ్ కెసిరెడ్డి.. హైదరాబాద్ నుంచి చెన్నైకు చేరుకుని అక్కడి నుంచి విదేశాలకు వెళ్లిపోవాలని కుట్ర చేశారు. కానీ ఈ లోపు సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.కాగా కసిరెడ్డి విచారణ సందర్భంగా పలువురి పేర్లు బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. నిన్న రాత్రి నుంచి కసిరెడ్డిని సిట్చీఫ్ రాజశేఖర్ బాబు విచారిస్తున్నారు. ఈవిచారణలో సిట్ చీఫ్‌తో పాటు ఏడుగురు అధికారుల బృందం ఉంది. అయితే వసూళ్ల నెట్‌వర్క్‌తో తనకు సంబంధం లేదని కసిరెడ్డి చెబుతున్నట్లు సమాచారం. గతంలో విజయసాయి, మిథున్ సిట్‌ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా విచారణ జరుగుతోంది. పలు ఆధారాలను చూపిస్తూ సిట్ బృందం ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో తెరపైకి బల్లం సుధీర్ అనే పేరు వచ్చింది. ఇతను కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. లావాదేవీలన్నీ సుధీర్ ద్వారానే జరిపినట్టు తెలుస్తుంది. ఇంతకు సుధీర్ ఎవరు అనే కోణంలో అధికారులు కూపీ లాగే పనిలో ఉన్నారు. ఏపీ, తెలంగాణలో ఇసుక మాఫియాలోనూ ఇద్దరూ ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. కసిరెడ్డి, సుధీర్ కలిసి వందల కోట్ల రూపాయలు వెనుకేసుకొన్నట్లు సమాచారం. ఈ లిక్కర్ స్కాంలో కేసిరెడ్డి తర్వాత సుధీర్దే కీలకపాత్రఅని అంటున్నారు. సుధీర్ అరెస్ట్ అయితే మరిన్ని సంచలనలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కేశినేని బ్రదర్స్ మధ్య వార్



**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** బెజవాడ రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య మళ్లీ ట్వీట్ల యుద్ధం మొదలయింది. విశాఖపట్నంలో ఉర్సా క్లస్టర్ కంపెనీకి భూములను కేటాయించడంపై కేశినేని అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు నాయుడును ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఉర్సా క్లస్టర్ కంపెనీకి ఒక విశ్వసనీయత లేదని, 2025లో స్థాపించిన సంస్థ కావడంతో దానికి అతి తక్కువ ధరకు భూములను కేటాయించడంపై కేశినేని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. ఈ సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని కూడా కేశినేని నాని కోరారు. దీనిపై అనేక విమర్శలు కూడా వెల్లువెత్తుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు... విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు ఉర్సా క్లస్టర్ కంపెనీకి అరవై ఎకరాలు కేటాయించడం ఇప్పటికే విమర్శలకు తావిచ్చింది. ఊరూ పేరులేని సంస్థకు అంత విలువైన భూములను ఎలా అప్పగిస్తారని జాతీయ మీడియాలో సయితం కథనాలు ప్రసారమయ్యాయి. 2025లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత స్థాపించిన పరిశ్రమకు అంత పెద్ద సంఖ్యలో భూముల ఎలా కేటాయిస్తారన్న ప్రశ్నలు బాగా వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేశినేని నాని ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పారు. 2024లో తనకు సీటు దక్కకపోవడంతో కేశినేని నాని టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి పోటీ చేసినా విజయవాడ పార్లమెంటు ప్రజలు మూడో సారి ఆదరించలేదు దీంతో మళ్లీ కేశినేని నాని చంద్రబాబుకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరగుతుంది. ఈ నేపథ్యలోనే ఆయన బర్త్ డే కి నిన్న ట్వీట్ చేసి నేడు మరో ట్వీట్ తో ఆయన సోదరుడు ప్రస్తుత ఎంపీ కేశినేని చిన్ని పితూరీలు చెప్పేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిలు అన్నదమ్ములయినప్పటికీ ఇద్దరి మధ్య ఆస్తుల వివాదాలతో పాటు రాజకీయ వైరుధ్యాలు ఉండటంతోనే ఈ ట్వీట్ వార్ స్టార్ట్ చేశారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. ఉర్సా క్లస్టర్ సంస్థ కేశినేని చిన్నికి చెందిందని, దానికి అంత పెద్ద సంఖ్యలో భూములు కేటాయించడాన్ని కేశినాని నాని తప్పు పట్టడం ఇప్పుడు బెజవాడ పాలిటిక్స్ లో హీట్‌ను రాజేసినట్లయింది. కేశినేని చిన్నికి సంబంధించిన సంస్థ కాబట్టే తక్కువ ధరకు అరవై ఎకరాల విలువైన భూములను కేటాయించారన్న అర్థం వచ్చే రీతిలో కేశినేని నాని ట్వీట్ చేయడం టీడీపీ నేతల ఆగ్రహానికి గురి చేసింది. అయితే దీనిపై బుద్ధా వెంకన్న మినహా ఎవరూ స్పందించకపోయినా కేశినేని నాని మరోసారి తన సోదరుడు చిన్నిని లక్ష్యంగా చేసుకుని ఈ ట్వీట్ చేశారంటూ పెద్దయెత్తున సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. నారా లోకేశ్ పేరును కూడా కేశినేని చిన్ని మద్యం, ఇసుక వంటి కేసుల్లో బయటకు తెస్తున్నారని కూడా కేశినేని నాని ట్వీట్ చేయడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోనే కాదు.. కూటమి పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది. మరోసారి బ్రదర్స్ మధ్య వార్ మళ్లీ మొదలయినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు

## తియ్యని పండ్ల వెనుక చేదు నిజాలు...

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** నూజివీడు.. మామిడి పండ్లకు కేరాఫ్ అడ్రస్. నూజివీడు ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడ కాయలు కోయకముందే వ్యాపారులు రైతులతో ఒప్పందం చేసుకొని తోటలను కొనుగోలు చేస్తారు. ఆ పంట వరకు డబ్బులు చెల్లించి.. కోత మొదలు పెడతారు. దీంతో రైతులకు పండ్లతో సంబంధం ఉండదు. కేవలం పండించడమే వారి బాధ్యత.ఇదంతా ఎలా ఉన్నా.. అసలు సమస్య అక్కడే మొదలవుతోంది. వ్యాపారులకు విక్రయించని రైతులు.. పండ్ల పండాక కోసి.. మార్కెట్లకు తరలిస్తారు. కానీ.. వ్యాపారులు కొనుగోలు చేసిన తోటల్లో.. పండ్లు పూర్తిగా పండకముందే.. కోస్తున్నారు. వాటికి రసాయనాలు పూసి.. తొందరగా పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. ఇలా చేయడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాటిని ఇతర పట్టణాలు, నగరాలకు తరలించి విక్రయిస్తున్నారు.రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పండ్లను తీసుకోవడం ద్వారా.. క్యాన్సర్, అల్సర్, లివర్, కిడ్నీ, జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలిన్ వాయువు.. నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి.2011 ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు ప్రకారం.. ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది. సహజంగా పండించే ఇథిలిన్‌ను మాత్రమే కొంత వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథిలిన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి పండులా కనిపించేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్‌లో చౌకగా లభిస్తుండటంతో వీటిని వ్యాపారులు ఇష్టానుసారంగా వాడుతున్నారు.'కృత్రిమంగా పండించిన పండ్లను తిన్న వారికి వాంతులు, విరేచనాలు, దాహం ఎక్కువగా కావటం, కడుపులో తిప్పటం వంటి సమస్యలు వస్తాయి. మామిడి పండ్లను తినే ముందు ఉప్పు నీటిలో కడగాలి. కృత్రిమంగా పండించిన పండ్లను సాధ్యమైనంత వరకు తినకపోవడం మంచిది' అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## జగన్ యూ.. టర్న్ తప్పదా...

**ఒంగోలు, ఏప్రిల్ 23, పెన్ పవర్:** మూడు రాజధానుల నుంచి మద్యం వరకు.. వలంటీర్ వ్యవస్థ నుంచి సచివాలయాల వరకు.. వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయోగాలు వికటించిన విషయం తెలిసిందే. ఇవే.. ఆయనను నిలువునా ముంచాయన్నది మేధావుల నుంచి విశ్లేషకుల వరకు చెబుతున్న మాట. తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అన్నట్టుగా ఆయన అప్పట్లో వ్యవహరించారన్న విమర్శలు తెలిసిందే. ఏరాష్ట్రంలోనూ లేని విధంగా మూడురాజధానులు తెచ్చారు. దీనిపైకేంద్రం కూడా విస్మయం వ్యక్తం చేసింది.ఇక, వలంటీర్ వ్యవస్థను తెచ్చామని చెప్పినా.. వారిని పొడిగించని ఫలితంగా ఇప్పుడు వారికి దిక్కు మొక్కు లేకుండా పోయింది. పైగా ఎన్నికల సమయంలో కీలక నాయకుల కంటే కూడా.. వారే ఎక్కువై పోయారన్నట్టుగా జగన్ వ్యవహరించారు. ఫలితంగా కార్యకర్తలు పోయి..వైసీపీని వలంటీర్లు నడిపించే పరిస్థితి వచ్చింది. ఇదో పెద్ద మైనస్‌గామారి.. ఎక్కడికక్కడ ఓటు బ్యాంకు చీలిపోయింది. ఫలితంగా వైసీపీ నాశనమైంది.ఇక, మరో రెండు కీలక విషయాలు.. మద్య నిషేధం.. చీప్ బ్రాండ్స్‌ను ఎక్కువ ధరలకు విక్రయించడం.. ఈ రెండు కూడా.. వికటించాయి. మద్యనిషేధం పేరుతో మంచి చేశామని జగన్ చెబుతున్నా.. ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ఇక, సచివాలయాలను నిర్మించి.. మంచి చేసినా.. దానివల్ల కూడా ప్రయోజనం రాబట్టుకోలేక పోయారు. సో.. మొత్తంగా జగన్ అనుసరించిన విధానాలు వివాదానికి దారితీశాయి. చివరకు ఆ పార్టీకి మైనస్ పై మైనస్ అయ్యాయి.ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి.. జగన్ తన విధానాలను మార్చుకోక తప్పదన్న వాదన బలంగా వినిపిస్తోంది. "ఏం చేస్తారో.. ఏమో.. మా విధానాలు మారాల్సి ఉంది. ఏదీ ఒక్కటీ కూడా వర్కవుట్ కాలేదు. మా నాయకుడు ఆదిశగా అడుగులు వేస్తారని అనుకుంటున్నాం. ఇంకా మూడు రాజధానులని మేం ఎలా చెబుతాం" అని సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలు పరిగణనలోకి తీసుకుంటే.. మార్పు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. సో.. జగన్‌తన విధానాలను మార్చుకునే టైం త్వరలోనే ఉందని కూడా అంటున్నారు. మరి ఏంచేస్తారు..? కొత్త విధానాలు ఏంటి? అనేది వేచి చూడాలి.

# పాక్ పేసర్ అత్యుత్సాహం.. తలకేసి బాదడంతో ఉస్మాన్ ఖాన్‌కు తీవ్ర గాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఎక్కడా జరగని ఊహించని సంఘటనలు పాక్ క్రికెట్ లో జరుగుతాయి. వీరు చేసే వింత పనులకి ఆశ్చర్యం కలగక మానదు. తాజాగా అలాంటి సంఘటన ఒకటి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో చోటు చేసుకుంది. పీఎస్ఎల్ లో భాగంగా మంగళవారం(ఏప్రిల్ 22) ముల్తాన్ సుల్తాన్స్, లాహోర్ ఖలందర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో

జరిగిన వింత సంఘటన ఒకటి వైరల్ గా మారుతుంది. ఫాస్ట్ బౌలర్ ఉబైద్ షా అత్యుత్సాహం కారణంగా తమ జట్టు ఉస్మాన్ ఖాన్ గాయాలపాలయ్యాడు. 229 పరుగుల లక్ష్య ఛేదనలో లాహోర్ ఖలందర్స్ విజయం కోసం పోరాడుతోంది. ఇన్నింగ్స్ 15 ఓవర్ చివరి బంతికి ఉబైద్ షా ఒక స్లో బాల్ తో బిల్లింగ్స్ ను ఔట్ చేశాడు. మ్యాచ్ లో ఈ వికెట్ కీలకం కావడంతో ఉబైద్ షా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. సంతోషంతో సెలెబ్రేషన్ ఓ రేంజ్ లో చేసుకున్నాడు. ఈ క్రమంలో నియంత్రణను కోల్పోయాడు. సహచర వికెట్ కీపర్ ఉస్మాన్ ఖాన్ కు హైఫై ఇచ్చే ప్రయత్నంలో అతని తలకేసి గట్టిగా బాదాడు. అత్యుత్సాహంలో ఉబైద్ షా తన అరా చేతితో ఉస్మాన్ తలను గట్టిగా కొట్టడంతో నొప్పితో అక్కడే పడిపోయాడు. హెల్మెట్ లేకుండా ఉండడంతో ఒక్కసారిగా ముల్తాన్ శిబిరంలో ఆందోళన కలిగింది. వెంటనే వైద్య శిబిరం వచ్చి అతనికి చికిత్స ఇవ్వడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మ్యాచ్ లో ఉబైద్ షా 4 ఓవర్లలో 33 పరుగులు చేసి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. మరోవైపు బిల్లింగ్స్ 23 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 43 పరుగులు చేసి ముల్తాన్ ను వణికించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే ముల్తాన్‌లో సుల్తాన్స్ 33 పరుగుల తేడాతో లాహోర్ ఖలందర్స్ పై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముల్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో లాహోర్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# వార్నర్, గిల్ క్రిస్ట్ కాదు.. ఐపీఎల్ చరిత్రలో అతడే బెస్ట్ ఆస్ట్రేలియన్ ప్లేయర్: ఆరోన్ ఫించ్




ఐపీఎల్ చరిత్రలో ఆస్ట్రేలియా క్రికెటర్లు చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. 2008లో ప్రారంభమైన ఈ మెగా లీగ్ లో ఆసీస్ క్రికెటర్ల హవా ప్రతి సీజన్ లో నడుస్తూనే ఉంటుంది. మాథ్యూ హేడెన్, మైఖేల్ హస్సీ,ఆడమ్ గిల్ క్రిస్ట్, రికీ పాంటింగ్,షేన్ వాట్సన్, గ్లెన్ మెగ్రాత్ లాంటి దిగ్గజ క్రికెటర్లు తమ ప్రభావాన్ని చూపగా.. ఆ తర్వాత స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, డేవిడ్ వార్నర్ తమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీ క్రికెట్ లో వన్ ఆఫ్ ది బెస్ట్ ప్లేయర్ గా రికార్డ్ ఉన్న ఆరోన్ ఫించ్.. ఐపీఎల్ లో మాత్రం రాణించలేకపోయాడు.

ఈ మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్ చాలా ఫ్రాంచైజీలకు ఆడినా అంచనాలు అందుకోలేకపోయారు. అయితే ఈ మెగా లీగ్ లో తన ఫేవరేట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. ఈఎస్పీయన్ క్రిక్ ఇన్ఫో తో ఇటీవల జరిగిన సంభాషణలో ఆస్ట్రేలియా వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ మాట్లాడాడు. ఇందులో భాగంగా ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ ఆస్ట్రేలియన్ ఆటగాడిని ఎంచుకోవాలని ఆరోన్ ఫించ్ ను అడిగారు. ఆప్షన్స్ కూడా ఇస్తూ మైఖేల్ హస్సీ, గ్లెన్ మాక్స్వెల్, ఆడమ్ గిల్ క్రిస్ట్, మాథ్యూ హేడెన్, రికీ పాంటింగ్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, డేవిడ్ వార్నర్ పేర్లను ఈ ఆసీస్ క్రికెటర్ ముందు ఉంచారు. ఈ లిస్ట్ చూసిన తర్వాత ఫించ్ వీరందరినీ వదిలేసి ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ ను లీగ్ లో అత్యుత్తమ ఆస్ట్రేలియన్ ప్లేయర్ గా ఎంచుకోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. వార్నర్, గిల్ క్రిస్ట్ గతంలో హైదరాబాద్ జట్లకు టైటిల్స్ అందించారు. వీరిద్దరినీ కాదని వాట్సన్ ను సెలక్ట్ చేసుకున్నాడు. వాట్సన్ తొలి సీజన్ నుంచి అద్భుతంగా ఆడుతున్నాడు. ప్రారంభంలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఈ ఆసీస్ ఆల్ రౌండర్ తొలి సీజన్ లోనే రాజస్థాన్ టైటిల్ గెలవడంతో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత చెన్నై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో పెద్దగా రాణించకపోయినా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున అదరగొట్టాడు.

# సొంతగడ్డపై బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్.. నాలుగేళ్ల తర్వాత జింబాబ్వేకు టెస్ట్ విజయం



టెస్ట్ క్రికెట్ లో జింబాబ్వే చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. సిల్హెట్ వేదికగా బంగ్లాదేశ్ పై జరిగిన మ్యాచ్ లో మూడు వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. బుధవారం (ఏప్రిల్ 23) 174 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసి బంగ్లాదేశ్ కు షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ వెళ్లిన జింబాబ్వే ఈ సంచలన విజయాన్ని నమోదు చేయడం విశేషం. నాలుగేళ్ల తర్వాత జింబాబ్వే టెస్టుల్లో విజయం సాధించడంతో వారి సెలెబ్రేషన్స్ ఓ రేంజ్ లో సాగాయి. చివరిసారిగా మార్చి 2021లో ఆఫ్ఘనిస్తాన్‌పై జింబాబ్వే టెస్ట్ గెలిచింది. 174 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వేకు అదిరిపోయే ఆరంభం లభించింది. తొలి వికెట్ కు ఓపెనర్లు బెన్ కరన్ (44), బెన్నెట్ (54) 95 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశారు. అయితే ఈ దశలో బంగ్లాదేశ్ బౌలర్లు చెలరేగారు. ఒక్కసారిగా విజృంభించి వికెట్లు తీస్తాడం స్టార్ట్ చేశారు. 50 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు తీసి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశారు. చివర్లో వెస్లీ మాధేవేరే(19లి) జాగ్రత్తగా ఆడుతూ సంచలన విజయాన్ని అందించాడు. రెండు ఇన్నింగ్స్ ల్లో 9 వికెట్లు పడగొట్టిన బ్లెస్సింగ్ ముజారబానీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బంగ్లా మూడో రోజు 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసిన బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (60 బ్యాటింగ్) ఓవర్ నైట్ స్కోర్ వద్ద ఔటయ్యాడు. ముజారబానీ 6 వికెట్లు తీసుకోగా.. చివర్లో లోయర్ ఆర్డర్ ను వెల్లింగ్టన్ మసకడ్జా పెవిలియన్ కు పంపాడు. అంతక ముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 273 రన్స్ వద్ద ఆలౌటైంది. ఫలితంగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టుకు 82 రన్స్ ఆధిక్యం లభించింది. సీన్ విలియమ్స్ (59), బ్రియాన్ బెనెట్ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్ లో 191 రన్స్‌కే ఆలౌటైంది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్ లో జింబాబ్వే 1-0 ఆధిక్యంలో నిలిచింది.



మీనాక్షి చౌదరి యొక్క లేటెస్ట్ లుక్స్ డ్రీమ్ క్లోసెట్ నుండి సూటిగా ఉన్నాయి

# బలగం భామ వాటితో సరిపెడుతోంది..!



కోర్టు నటి తన ఇన్‌స్టా టు సినిమా గ్లో-అప్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది

చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసిన వారికి పెద్దయ్యాక సినిమా ఆఫర్లు రావడం చాలా అరుదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా వాళ్లని చూసిన ఆడియన్స్ పెద్దయ్యాక వారు లీడ్ రోల్స్ చేసినా ఆడియన్స్ ఇంప్రెస్ అవుతారా లేదా అన్నది చెప్పడం కష్టం. అలా చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి సక్సెస్ అయిన తరుణ్ కూడా కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు చేసిన సినిమాల వల్ల ఫేడవుట్ అయిపోయాడు. ఇక చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి హీరోయిన్ గా



కూడా చేసిన భామలు ఉన్నారు. వారిలో ఎవరు టాప్ రేంజ్ కి వెళ్లింది లేదు. ఈ క్రమంలో చైల్డ్ రోల్స్ చేసి మెప్పించిన కావ్య కళ్యాణ్ రామ్ మసూధ తో తిరిగి ఎంట్రీ ఇచ్చి బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. బలగం హిట్ తర్వాత ఒకటి రెండు సినిమాలు చేసిన కావ్య ఆ తర్వాత ఎందుకో అవకాశాలు అందుకోలేదు. సినిమా ఛాన్స్ లు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ తో మాత్రం కేక పెట్టిస్తుంది. సినిమాల్లో ఛాన్స్ లు రావాలంటే ఫోటో షూట్స్ తప్పనిసరి అనే విషయాన్ని కనిపెట్టిన అమ్మడు రకరకాల ఫోటో షూట్స్ తో రచ్చ రచ్చ చేస్తుంది. ఒక మోస్తారు ఇమేజ్ ఉన్న హీరోయిన్స్ కూడా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంటారు. అందుకే కావ్య కళ్యాణ్ రామ్ కూడా అదే దారిలో అటు సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే ఫోటో షూట్స్ విషయంలో మాత్రం చాలా ఫోకస్డ్ గా ఉంది. కావ్య ఫోటో షూట్స్ లో ఏదో తెలియని మ్యాజిక్ ఉంటుంది. అందుకే అమ్మడు ఎప్పుడు ఫోటో షూట్ చేసినా కూడా అది వైరల్ అవుతుంది. ముఖ్యంగా అమ్మడు శారీతో చేసే ఫోటో షూట్స్ కి ఫాలోవర్స్ పిచ్చెక్కిపోతున్నారు. తెలుగు హీరోయిన్స్ లో తనకంటూ ఒక సెపరేట్ ఐడెంటిటీ రావాలని ట్రై చేస్తున్న అమ్మడు ఫోటో షూట్స్ ని బ్లాక్ బస్టర్ అనిపిస్తుంది. ఐతే ఇలా ఫోటో షూట్స్ తో సరిపెట్టడమేనా సినిమాలు చేసేది ఏమైనా ఉందా అన్న కామెంట్స్ వినిపిస్తున్నా ఎవరు ఏమైనా అనుకోని తను చేసేది చేసుకుంటూ వెళ్తానని అంటుంది అమ్మడు. అంతేకాదు ఖాళీగా ఉన్నాం కదా అని ఎలాంటి సినిమా పడితే అలాంటి సినిమా చేయకుండా కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తుంది కావ్య. అందుకే వరుస సినిమాలు చేయట్లేదని తెలుస్తుంది. మరి కావ్య కళ్యాణ్ రాం నెక్స్ట్ సినిమా ఏది అవుతుంది. ఫోటో షూట్స్ లో కాకుండా ఆమెను తెర మీద ఎప్పుడు చూస్తామంటూ ఆడియన్స్ ఆసక్తి చూపిస్తున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com